# మన విశ్వం

manavishwam.com

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 97 | బుధవారం 23 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్


## జీతమెంత?.. ఆస్తులెంత!



- కాగితాల్లో రూ.6.13 కోట్లు.. మార్కెట్‌లో విలువెంత?
- నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు
- 8 చోట్ల సోదాలు.. ఫ్లాట్లు, ప్లాట్లు, పెట్టుబడుల గుర్తింపు
- జాగ్వార్, ఆడి, నెక్సాన్ కార్లు.. 517.8 గ్రాముల బంగారం
- రూ.2.63 కోట్ల ఫ్లాట్ పెట్టుబడి- హ్యాండ్ లోన్లపైనా ఆరా

వివరాలు 2లో..

# అట్రాసిటీ బాధితులకు.. గ్రీన్ ఛానెల్ భరోసా!



- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి ఎస్సీ-ఎస్టీ చట్టంపై రాష్ట్రస్థాయి సమీక్ష
- నష్టపరిహారం, పునరావాస నిధులు ఆలస్యం చేయొద్దన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 73 గ్రామాల్లో అధికంగా అట్రాసిటీ కేసులు.. ప్రత్యేక దృష్టికి పోలీసులకు ఆదేశం
- షాబాద్ హత్యలు, తుక్కుగూడ నర్సు కేసుపై సత్వర న్యాయం చేయాలని సూచన
- జిల్లా విజిలెన్స్ కమిటీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం
- దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామన్న సీఎం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార ఘటనల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారం, సహాయం, పునరావాస నిధులను బడ్జెట్‌తో ముడిపెట్టి ఆలస్యం చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేసి బాధిత కుటుంబాలను సకాలంలో ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ కమిటీ రాష్ట్రస్థాయి సమావేశం జరగడం ఇదే

మిగతా 2లో..



- కాంగ్రెస్ హామీలు, 22ఏ భూములపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్
- రూ.1,400 కోట్ల పార్టీ నిధులపై 'క్విడ్ ప్రో కో' ఆరోపణలు చేసిన కవిత
- పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీశ్ పావులు కదుపుతున్నారంటూ విమర్శ
- 'తాతల ఆస్తులైతే.. మాకెందుకు రాలేదు?' అంటూ రమ్యారావు ప్రశ్న
- కేటీఆర్, సంతోష్‌రావు కుటుంబ ఆస్తుల మూలాలపైనా నిలదీత
- బయట కాంగ్రెస్‌తో పోరు.. కుటుంబ సంబంధీకుల ఆరోపణలతో కొత్త రాజకీయ సవాల్

# బీఆర్ఎస్‌కు.. ఆడబిడ్డల సెగ!

## ఓవైపు కవిత.. మరోవైపు రమ్యారావు ఆరోపణల దాడి







**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలను అస్త్రాలుగా చేసుకుని దూకుడు పెంచుతున్న బీఆర్ఎస్‌కు.. కుటుంబ సంబంధాలు కలిగిన ఇద్దరు మహిళా నేతల ఆరోపణలు కొత్త రాజకీయ సవాల్‌గా మారుతున్నాయి. ఎన్నికల హామీల అమలు, రైతు సమస్యలు, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. రాష్ట్రవ్యాప్త నిరసనలు, 'బాకీ కార్డుల' పంపిణీ వంటి కార్యక్రమాలతో కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి సమయంలో కేసీఆర్ కుమార్తె, ప్రస్తుతం తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. మరోవైపు

మిగతా 2లో..

# ఆసుపత్రికెళ్తే.. ప్రాణానికి భరోసా ఏది?



- ఆదిలాబాద్ రిమ్స్‌లో నవజాత శిశువుల వార్డులో అగ్నిప్రమాదం
- వరంగల్ ఎంజీఎంలో ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- ఒకచోట అగ్ని భద్రత.. మరోచోట శిథిల భవనం
- వైద్యం కోసం వచ్చే పేదలకు ఆసుపత్రుల్లోనే భద్రతపై భయం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానలకు 'సేఫ్టీ ఆడిట్' చేయాలనే డిమాండ్
- ఆరోగ్యశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** జబ్బు నయం చేసుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే.. అక్కడ ప్రాణానికి భరోసా ఉందా? ఆదిలాబాద్ రిమ్స్‌లో నవజాత శిశువుల విభాగాన్ని మంటలు చుట్టుముట్టడం.. వరంగల్ ఎంజీఎంలో పైకప్పు పెచ్చులు ఊడిపడటం.. వరుస ఘటనలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల భద్రతపై

మిగతా 2లో..





## రిమ్స్ ఘటనపై మంత్రి ఆరా

- శిశువుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్ష
- కుటుంబాలకు భరోసా.. ఫైర్ సేఫ్టీపై అధికారులకు ఆదేశాలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (మన విశ్వం): ఆదిలాబాద్ రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం ఆసుపత్రిని

మిగతా 2లో..

# కేసీఆర్‌పై కోపం.. రైతులపై కక్షా?

- నీళ్లున్నా ఎత్తిపోయరా?.. పంటలు ఎండాక మేల్కొంటారా?
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు ప్రణాళిక ఏదని ఈటల ప్రశ్న
- మేడిగడ్డ వద్ద నీరు దిగువకు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శ
- గోదావరి నీటిని లిఫ్ట్ చేయాలి.. కృష్ణా జలాలు విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (మన విశ్వం): "కేసీఆర్‌పై కోపం ఉంటే ఆయనపై తీర్చుకోండి.. రైతులపై చూపొద్దు. కళ్లముందే నీళ్లున్నా పంటలకు ఇవ్వకుండా రైతుల గోస పుచ్చుకుంటారా?" అంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై

మిగతా 2లో..



# సర్కారు చెప్పినా.. ఫీజుల లెక్క గుట్టే!

- ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల పారదర్శకతపై విద్యాశాఖ ఆదేశాలు
- వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో పూర్తి వివరాలు పెట్టాలన్న నిబంధన
- క్షేత్రస్థాయిలో అమలుపై తల్లిదండ్రుల నుంచి ప్రశ్నలు
- ట్యూషన్‌తో పాటు రకరకాల పేర్లతో అదనపు రుసుముల భారం
- జిల్లాలవారీగా తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలనే డిమాండ్

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** ఫీజుల వివరాలు బహిర్గతం చేయండి.. తల్లిదండ్రులకు పూర్తి లెక్క చెప్పండి.. వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో రుసుముల వివరాలు కనిపించేలా చూడండి.. అంటూ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా అవి ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారింది. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్న కుటుంబాలపై ఏటా ఫీజుల భారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన పారదర్శకత నిబంధనలను అన్ని యాజమాన్యాలు పాటిస్తున్నాయా? విద్యాశాఖ పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉంది? అన్న చర్చ మొదలైంది. ట్యూషన్ ఫీజుతోనే తల్లిదండ్రుల ఖర్చు ఆగడం లేదు. అడ్మిషన్, ట్రాన్స్‌పోర్ట్, యాక్టివిటీ,

మిగతా 2లో..

# మా వల్లే గెలుపు.. ఇప్పుడు మాపైనే పోరా?



మంచిర్యాల కాంగ్రెస్‌లో భగ్గుమన్న అంతర్గత విభేదాలు



- "చీమల దండు కదిలింది.. గంజాయి బ్యాచ్, మంత్రగాళ్లు జాగ్రత్త" అంటూ ప్రేమ్‌సాగర్‌రావు హెచ్చరిక
- "మా సహాయం లేకుంటే ఎంపీగా గెలిచేవాడా?" అంటూ ఎంపీ వర్గంపై పరోక్ష విమర్శలు
- "అందరం కలిసి గెలిపిస్తే.. ఇప్పుడు మమ్మల్నే ఇబ్బంది పెడుతున్నారు" అంటూ ఆగ్రహం
- "దళితుల ప్రేమికులు కాదు.. దళితులను తొక్కేసింది మీరే" అంటూ మరో ఘాటు వ్యాఖ్య
- వంశీకృష్ణ బైక్ ర్యాలీ.. ఫ్లెక్సీల వివాదం తర్వాత మరింత వేడెక్కిన రాజకీయం
- నాడు గెలుపు కోసం ఒక్కటైన నేతలు.. నేడు ఆధిపత్య పోరుతో మారుతున్న సమీకరణాలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** నాడు ఎంపీ గెలుపు కోసం కలిసి నడిచారు.. నేడు అదే గెలుపును ప్రస్తావిస్తూ మాటల తూటాలు పేలుతున్నాయి. మంచిర్యాల కాంగ్రెస్‌లో కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తాజా వ్యాఖ్యలతో మరింత వేడెక్కాయి. "మా సహాయం లేకుంటే ఎంపీగా గెలిచేవాడా?", "అందరం కలిసి గెలిపిస్తే ఇప్పుడు మమ్మల్నే ఇబ్బంది పెడుతున్నారు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వర్గంతో నెలకొన్న విభేదాల నేపథ్యంలో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల వంశీకృష్ణ బైక్ ర్యాలీ, ఫ్లెక్సీల వివాదం తర్వాత ఇప్పుడు ప్రేమ్‌సాగర్‌రావు ఘాటు వ్యాఖ్యలు తెరపైకి రావడంతో మంచిర్యాల కాంగ్రెస్‌లో వర్గపోరు మరో మలుపు తిరిగింది. "చీమల దండు కదిలింది.. గంజాయి బ్యాచ్, మంత్రగాళ్లు జాగ్రత్తగా ఉండాలి" అంటూ ప్రేమ్‌సాగర్‌రావు హెచ్చరించారు. "మా కార్యకర్తలు కాలు వేసి తొక్కితే సచ్చిపోతారు.. వాళ్లు చేయి లేపే దాకా తెచ్చుకోవద్దు" అంటూ కార్యకర్తల జోలికి రావద్దనే రీతిలో ఘాటుగా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు ఇప్పటికే వేడెక్కిన స్థానిక కాంగ్రెస్ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీశాయి. ఎంపీ ఎన్నికల ప్రస్తావనతో ప్రేమ్‌సాగర్‌రావు మరింత ఘాటుగా స్పందించారు. "మా సహాయం లేకుంటే ఎంపీగా గెలిచేవాడా? అందరం కలిసి గెలిపిస్తే ఈరోజు మమ్మల్నే ఇబ్బంది పెడుతున్నారు. పనికిమాలిన వాళ్లను వెంట వేసుకుని తిరుగుతూ కాంగ్రెస్ అనుచరులను క్షోభకు గురిచేస్తున్నారు" అంటూ

మిగతా 2లో..

# నేరంపై పట్టు.. సవాళ్లపై కన్ను!

- తీవ్రమైన నేరాల్లో 10.33 శాతం తగ్గుదల.. సైబర్, ఆర్థిక నేరాల్లోనూ క్షీణత
- సీసీటీఎన్ఎస్ సమాచార నమోదు 96 శాతానికి.. సాంకేతిక పోలీసింగ్‌కు పదును
- మాదకద్రవ్యాల కేసులు 46.10 శాతం పైకి.. వ్యవస్థీకృత నేరాల నమోదులో భారీ పెరుగుదల
- 'ఈగల్'తో మాదకద్రవ్యాల ముఠాల మూలాలపై గురి
- కృత్రిమ మేధ, అంక ఆధారాల పరిశీలనతో మారుతున్న తెలంగాణ పోలీసింగ్
- ప్రజా స్పందన, సిబ్బంది సంక్షేమంపై డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి

వివరాలు 2లో..



మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# సేద్యానికి సాంకేతిక బలం

వ్యవసాయం మారుతోంది.. రైతు ఆలోచనా మారుతోంది. ఒకప్పుడు అనుభవం, వర్షాలు, సంప్రదాయ పద్ధతులే సాగుకు ఆధారమైతే.. ఇప్పుడు వాటికి సాంకేతికత తోడవుతోంది. వాతావరణ మార్పులు, పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, కూలీల కొరత, నీటి సమస్యలు రైతును ఆధునిక సాగు వైపు నడిపిస్తున్నాయి. పంటకు ఎప్పుడు నీరు అవసరం?.. నేలలో తేమ ఎంత?.. ఎరువులు ఎప్పుడు వేయాలి?.. తెగుళ్ల ముప్పు ఉందా?.. వాతావరణం ఎలా ఉండబోతోంది?.. వంటి సమాచారాన్ని ముందుగానే తెలుసుకునే అవకాశాలు పెరుగుతున్నాయి. రైతు అనుభవానికి సాంకేతిక సమాచారం తోడైతే అనవసర ఖర్చులు తగ్గడంతో పాటు పంట నష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుంది. నీటి కొరత పెరుగుతున్న నేపథ్యంలో బిందు, తుంపర సేద్యానికి మరింత ప్రాధాన్యం అవసరం. అవసరమైన మేరకే నీటిని అందించడం ద్వారా వృథాను తగ్గించవచ్చు. దుక్కి నుంచి విత్తనం, పిచికారీ, కోత వరకు యంత్రాల వినియోగం పెరగడం కూలీల కొరతకు కొంత పరిష్కారంగా మారుతోంది. అయితే ఖరీదైన యంత్రాలు చిన్న రైతుకూ అందుబాటులో ఉండేలా అద్దె కేంద్రాలను గ్రామస్థాయిలో విస్తరించాలి. సాంకేతిక వ్యవసాయం అంటే యంత్రాలు మాత్రమే కాదు.. సమాచారం కూడా. వాతావరణ అంచనాలు, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ, ప్రభుత్వ పథకాల వివరాలు సరైన సమయంలో రైతుకు చేరాలి. పంట పండించడమే కాదు.. దానికి గిట్టుబాటు ధర పొందేందుకు అవసరమైన మార్కెట్ సమాచారం కూడా రైతు చేతిలో ఉండాలి. ఆధునిక వ్యవసాయం కొందరు పెద్ద రైతులకే పరిమితం కాకూడదు. చిన్న, సన్నకారు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, పరికరాలు అందుబాటులోకి రావాలి. స్థానిక నేల, నీరు, పంటలకు అనుగుణంగా ఉపయోగపడే పద్ధతులను వ్యవసాయ శాఖ, పరిశోధనా సంస్థలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయాలి. రైతు అనుభవానికి సాంకేతికత ప్రత్యామ్నాయం కాదు.. అదనపు బలం. సాగు ఖర్చు తగ్గి, నీరు ఆదా అయి, దిగుబడి మెరుగై, రైతుకు గిట్టుబాటు లభించినప్పుడే ఆధునిక వ్యవసాయానికి అసలైన అర్థం. సాంకేతికత చిన్న రైతు చేను వరకు చేరినప్పుడే సేద్యానికి నిజమైన కొత్త బలం చేకూరుతుంది.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# కేసీఆర్‌పై కోపం.. రైతులపై కక్షా?

**(మొదటిపేజీ తరువాయి)**

తీవ్ర విమర్శలు చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో రిటైర్డ్ ఇంజనీర్లతో ఎల్‌నినో, సాగునీటి పరిస్థితులపై చర్చించిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద 36 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోందని, గోదావరి నీటిమట్టం 96.5 మీటర్ల వద్ద ఉండగా లిఫ్టింగ్‌కు 93.5 మీటర్లు సరిపోతుందని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చిన తర్వాత కూడా నీటిని ఎత్తిపోయడంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సెప్టెంబర్‌లోనే పంటలు ఎండిపోతున్నాయని, సాగునీటి కోసం రైతులు ధర్నాలు, ముట్టడులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. "రైతులు గొడవ చేస్తే తప్ప నీళ్లు వదలాలనే సోయి లేదా?" అని నిలదీశారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఈటల.. రాయలసీమకు భారీగా నీరు తరలిపోతుంటే తెలంగాణలో మహబూబ్‌నగర్ ఎత్తిపోతల ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేని పరిస్థితి ఎందుకని ప్రశ్నించారు. "ఇకనైనా గోదావరి నుంచి నీటిని లిఫ్ట్ చేయండి. కృష్ణా నుంచి సాగునీటిని విడుదల చేయండి. రిటైర్డ్ ఇంజనీర్ల సూచనలు పాటించండి. ఉత్తర తెలంగాణను ఎండబెట్టకండి.. హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తీసుకురాకండి" అని ఈటల డిమాండ్ చేశారు.

# సర్కారు చెప్పినా.. ఫీజుల లెక్క గుట్టే!

**(మొదటిపేజీ తరువాయి)**

స్మార్ట్ క్లాస్, పరీక్షలు, డెవలప్‌మెంట్ తదితర పేర్లతో అదనపు రుసుములు ఉంటున్నాయన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు తదితర ఖర్చులు కలిపితే కుటుంబాలపై మరింత భారం పడుతోందని పేరెంట్స్ చెబుతున్నారు. ఏడాది ప్రారంభంలోనే మొత్తం ఎంత చెల్లించాలి? ఏ పేరుతో ఎంత తీసుకుంటారు? అనే పూర్తి లెక్క ముందుగానే తెలియాలని కోరుతున్నారు. స్కూల్ వసూలు చేసే ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌తో పాటు నోటీసు బోర్డులోనూ ప్రదర్శించాలన్నది విద్యాశాఖ ఆదేశాల ఉద్దేశం. తద్వారా అడ్మిషన్‌కు ముందే తల్లిదండ్రులకు ఆర్థిక భారం ఎంత ఉంటుందో స్పష్టత రావాలి. అయితే రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయా? చేయని వాటిని అధికారులు గుర్తించారా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన జిల్లాలవారీ లెక్కలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ వినిపిస్తోంది.
ఉత్తర్వులు జారీ చేయడంతోనే సరిపోదని తల్లిదండ్రులు అంటున్నారు. ప్రతి జిల్లాలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి, స్కూళ్లు ప్రకటించిన ఫీజులు--వాస్తవంగా వసూలు చేస్తున్న రుసుములను పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడంతో పాటు తీసుకున్న చర్యల వివరాలను కూడా బహిర్గతం చేయాలంటున్నారు.
రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ స్కూల్‌కు సంబంధించిన తరగతులవారీ ఫీజులు, ఇతర రుసుములు తల్లిదండ్రులకు ఒకేచోట కనిపించేలా అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రకటించిన దానికంటే అదనంగా వసూలు చేస్తే వెంటనే ఫిర్యాదు చేసే అవకాశం, ఆ ఫిర్యాదుపై తీసుకున్న చర్య తెలుసుకునే విధానం కూడా ఉండాలని కోరుతున్నారు. ఫీజులు వసూలు చేసేటప్పుడు పక్కా లెక్క ఉంటే.. అదే లెక్కను తల్లిదండ్రుల ముందు పెట్టడంలో ఇబ్బందేమిటి? ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా అమలు జరగకపోతే బాధ్యత ఎవరిది? రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై పారదర్శకతను

# అట్రాసిటీ బాధితులకు.. గ్రీన్ ఛానెల్ భరోసా!

**(మొదటిపేజీ తరువాయి)**

తొలిసారని ప్రభుత్వం తెలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం జరిగిందని పేర్కొంది. దాదాపు 13 ఏళ్ల తర్వాత చట్టం అమలు, కేసుల నమోదు, దర్యాప్తు, విచారణ, పరిష్కారం, బాధితులకు సహాయం, పునరావాసంపై సమగ్రంగా సమీక్షించారు.

**73 గ్రామాలపై ప్రత్యేక దృష్టి**

గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుతున్నాయని అధికారులు సమావేశంలో వివరించారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరు, చట్టంపై అవగాహన కార్యక్రమాలను కూడా సమీక్షించారు.

**బడ్జెట్ కోసం ఆపొద్దు**

అట్రాసిటీ బాధితులకు నష్టపరిహారం, సహాయ-పునరావాసం అందించడంలో జాప్యం ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. నిధుల కొరత కారణంగా బాధితులకు అందాల్సిన సహాయం నిలిచిపోకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**చదువుతోనే జీవితాల్లో మార్పు**

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధే కీలకమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో 31 శాతం ఎస్సీలు ఉన్నారని, ఎస్టీ జనాభా 10 శాతం ఉండగా వారికి 17 శాతం ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. అట్టడుగు వర్గాలను విద్య వైపు నడిపించకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు.. ఆడబిడ్డల సెగ!

**(మొదటిపేజీ తరువాయి)**

కేసీఆర్ అన్న కుమార్తె, కాంగ్రెస్ నాయకురాలు రమ్యారావు వేర్వేరు సందర్భాల్లో చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ నాయకత్వంపై మరో చర్చకు తెరతీశాయి.
రూ.1,400 కోట్లపై కవిత ఆరోపణలు
బీఆర్ఎస్ వద్ద ఉన్న సుమారు రూ.1,400 కోట్ల పార్టీ నిధులు 'క్విడ్ ప్రో కో' ఒప్పందాల ద్వారా సమకూరాయని కవిత గత జూలైలో ఆరోపించారు. ఆంధ్రా కాంట్రాక్టర్లతో జరిగిన లావాదేవీల ద్వారా ఈ నిధులు వచ్చాయని పేర్కొంటూ, ఆ మొత్తాన్ని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. అయితే ఇవి కవిత చేసిన ఆరోపణలే తప్ప అవినీతి జరిగినట్లు నిర్ధారితమైన అంశాలు మాత్రం కాదు. హరీశ్‌రావుపైనా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌ను తన ఆధీనంలోకి తీసుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నారని, ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీపై పట్టు సాధించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**రమ్యారావు ప్రశ్నల వర్షం**

తాజాగా రమ్యారావు కేసీఆర్ కుటుంబ ఆస్తుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. పూర్వీకుల నుంచే వందల ఎకరాల భూములు వచ్చాయన్న వాదనను ప్రశ్నిస్తూ.. నిజంగానే అవి తాతల ఆస్తులైతే తమ తండ్రికి రావాల్సిన వాటా ఏమైందని నిలదీశారు. తన పెళ్లి, కేటీఆర్ పెళ్లి జరిగిన సమయంలో కుటుంబాల వద్ద పది ఎకరాలు కూడా లేవని ఆమె పేర్కొన్నారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబ ఆస్తులపైనా రమ్యారావు ప్రశ్నలు లేవనెత్తారు. కుదురుపాక ప్లాట్లు, మార్కుక్ భూములు, నానక్‌రామ్‌గూడ ఆస్తులను ప్రస్తావిస్తూ వాటి మూలాలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**బయట పోరు.. ఇటు ఆరోపణల సెగ**

కాంగ్రెస్ ఎన్నికల హామీలు, రైతు సమస్యలు, 22ఏ భూముల అంశాలను బీఆర్ఎస్ ప్రధాన రాజకీయ అస్త్రాలుగా తీసుకుని ప్రభుత్వంపై పోరాటం సాగిస్తోంది. ఈ అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు--ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాలు పార్టీకి క్షేత్రస్థాయిలో ఎంత రాజకీయ ప్రయోజనం కలిగిస్తున్నాయన్నదానిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నప్పటికీ, ఇదే సమయంలో కుటుంబ సంబంధీకులైన కవిత, రమ్యారావు నుంచి పార్టీ నిధులు, నాయకత్వం, కుటుంబ ఆస్తులపై వస్తున్న ఆరోపణలు బీఆర్ఎస్‌ను వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిలోకి నెడుతున్నాయి. ఈ ఆరోపణలు క్షేత్రస్థాయిలో పార్టీపై ఎంత ప్రభావం చూపుతున్నాయన్నది ఇప్పుడే నిర్ధారించలేకపోయినా, ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న సమయంలోనే ఈ వివాదం కొనసాగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**తాతల ఆస్తులైతే.. మాకెందుకు రాలేదు?**

"వందల ఎకరాలు తాతల నుంచే వచ్చాయంటే మా నాన్న వాటా ఎక్కడ? నా పెళ్లి, కేటీఆర్ పెళ్లి సమయానికి పది ఎకరాలు కూడా లేవు. ఇప్పుడు ఇన్ని ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలి" అంటూ రమ్యారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీలు, 22ఏ భూములు, రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్‌కు.. మరోవైపు కుటుంబ సంబంధీకుల నుంచే పార్టీ నిధులు, ఆస్తులు, నాయకత్వంపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకత్వం ఎలాంటి వివరణ ఇస్తుందన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# ఆసుపత్రికెళ్తే.. ప్రాణానికి భరోసా ఏది?

**(మొదటిపేజీ తరువాయి)**

ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకచోట అగ్ని ప్రమాదం.. మరోచోట పాత భవనం నుంచి పెచ్చులు రాలడం.. కారణాలు వేరైనా రెండుచోట్లా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే-వైద్యం కోసం వచ్చినవారి భద్రతకు భరోసా ఎవరు?
ఆదిలాబాద్ రిమ్స్‌లో సోమవారం అర్ధరాత్రి స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. వార్డులో పొగ వ్యాపించడంతో చికిత్స పొందుతున్న పసికందులను సిబ్బంది హుటాహుటిన బయటకు తరలించాల్సి వచ్చింది. ప్రాథమికంగా ఏసీ/విద్యుత్ వ్యవస్థలో లోపం కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నప్పటికీ ప్రమాదానికి కచ్చితమైన కారణం విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటన నవజాత శిశువుల వంటి అత్యంత సున్నితమైన విభాగాల్లో ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఎంత పకడ్బందీగా ఉందన్న ప్రశ్నను ముందుకు తెచ్చింది.
ఎంజీఎంలో పెచ్చుల భయం
వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు పైకప్పు నుంచి కాంక్రీట్ పెచ్చులు ఊడిపడటంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం వార్డును ఖాళీ చేసి రోగులను మరోచోటికి తరలించారు. ఉత్తర తెలంగాణలో నిత్యం వేలాది మందికి వైద్యసేవలు అందించే కీలక ఆసుపత్రిలోనే భవన భద్రతపై ప్రశ్నలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది.
మందులతో పాటు.. భద్రతా కావాలి!
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో అత్యధికులు సామాన్యులు, పేదలే. మెరుగైన వైద్యం అందించడమే కాదు.. ఆసుపత్రి భవనం, విద్యుత్ వ్యవస్థ, ఐసీయూలు, ఏసీలు, ఫైర్ అలారాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు కూడా సురక్షితంగా ఉండాలి. ప్రమాదం జరిగిన తర్వాత మరమ్మతులు చేయడం కాకుండా ముందే లోపాలను గుర్తించే వ్యవస్థ ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రాష్ట్రవ్యాప్తంగా సేఫ్టీ ఆడిట్ ఎప్పుడు?**

ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ ఎంజీఎం ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలోని బోధన, జిల్లా, ఏరియా ఆసుపత్రులన్నింటిలో సమగ్ర భద్రతా తనిఖీలు చేపట్టాలనే డిమాండ్ ముందుకొస్తోంది. ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయా? పాత భవనాలకు స్ట్రక్చరల్ ఆడిట్ జరిగిందా? విద్యుత్ వైరింగ్, ఏసీ వ్యవస్థలను ఎప్పుడు తనిఖీ చేశారు? అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించే ప్రణాళిక ఉందా? అన్న అంశాలను ఆసుపత్రులవారీగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.
ప్రాణం నిలబెట్టుకోవాలనే ఆశతో ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగికి చికిత్సతో పాటు భద్రతపైనా భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వరుస ఘటనల నేపథ్యంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేకంగా దృష్టి సారించి, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల భద్రతపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**రిమ్స్ అగ్నిప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి**

హైదరాబాద్ (మన విశ్వం): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో చిన్నారులు మృతి చెందడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సూచించారు.

## రిమ్స్ ఘటనపై మంత్రి ఆరా

**(మొదటిపేజీ తరువాయి)**

సందర్శించారు. ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి శిశువుల తరలింపు, చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించిన మంత్రి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను సమీక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు.మంత్రి వెంట ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.



# నేరంపై పట్టు.. సవాళ్లపై కన్ను!

**క్రైం బ్యూరో, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** నేరం రూపం మారుతోంది.. దానికి తగ్గట్టే తెలంగాణ పోలీసింగ్ కూడా మారుతోంది. మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక మోసాలు కొత్త సవాళ్లు విసురుతుండగా.. సమాచార విశ్లేషణ, కృత్రిమ మేధ, అంక ఆధారాల పరిశీలన, ప్రత్యేక దళాలతో పోలీస్ శాఖ వ్యూహానికి పదును పెడుతోంది. కొన్ని కీలక నేరాల్లో తగ్గుదల ఊరటనిస్తుండగా.. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు ప్రమాదాలు అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. సాధించిన పురోగతిని నిలబెట్టుకుంటూ కొత్త నేరాల కంటే ఒక అడుగు ముందుండటమే డీజీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలోని తెలంగాణ ఖాకీ ముందున్న ప్రధాన సవాల్.

**తగ్గిన నేరాలు.. కనిపిస్తున్న ఫలితం**

తాజా అర్ధవార్షిక నేర సమీక్షలో తీవ్రమైన నేరాలు 7,019 నుంచి 6,294కు తగ్గాయి. అంటే 10.33 శాతం క్షీణత. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. సీసీటీఎన్ఎస్ సమాచార నమోదు 70-80 శాతం స్థాయి నుంచి 96 శాతానికి చేరినట్లు సమీక్ష వెల్లడించింది.

**పెరిగినవి.. కొత్త హెచ్చరిక**

మొత్తం నమోదైన కేసులు మూడేళ్ల పోలికలో 2,65,377 నుంచి 2,84,363కు పెరిగాయి. మాదకద్రవ్యాల కేసులు 2,026 నుంచి 2,960కి చేరి 46.10 శాతం పెరిగాయి. వ్యవస్థీకృత నేరాలుగా నమోదైన కేసులు 25 నుంచి 451కు పెరిగాయి. కేసుల గుర్తింపు, వర్గీకరణ, తనిఖీలు పెరగడం కూడా ఈ సంఖ్యలపై ప్రభావం చూపవచ్చు. అయినప్పటికీ కొత్త తరహా నేరాలపై మరింత నిఘా అవసరాన్ని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

**జిల్లాకో లెక్క.. నేరానికో వ్యూహం**

ప్రతి జిల్లా, కమిషనరేట్‌లో నేరాల స్వభావాన్ని విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నది డీజీపీ సీవీ ఆనంద్ దిశ. మాదకద్రవ్యాలు, ఆస్తి నేరాలు, సైబర్ మోసాలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో గుర్తించి క్షేత్రస్థాయిలో దానికి తగ్గ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**కృత్రిమ మేధతో.. నేరం జాడలో!**

కృత్రిమ మేధ, సీసీటీఎన్ఎస్ 2.0, డ్రోన్లు, దృశ్య విశ్లేషణ, అంక ఆధారాల పరిశీలన వినియోగాన్ని విస్తరిస్తున్నారు. డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్, హాక్ఐ వంటి వ్యవస్థల సమన్వయంపైనా దృష్టి పెట్టారు.

**మాదకద్రవ్యాలపై 'ఈగల్' గురి**

'ఈగల్' ప్రత్యేక దళానికి మరింత పదును పెడుతున్నారు. చిన్నస్థాయి విక్రేతలతో ఆగకుండా సరఫరా గొలుసు, సూత్రధారులు, డబ్బు లావాదేవీలు, అంతర్రాష్ట్ర--అంతర్జాతీయ సంబంధాల మూలాల వరకు వెళ్లాలని డీజీపీ సూచించారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో శిక్షల శాతం 19 నుంచి 28 శాతానికి పెరిగినట్లు మే సమీక్షలో వెల్లడైంది.

**సైబర్‌లో తగ్గినా.. ముప్పు పోలేదు**

సైబర్ నేరాల్లో తగ్గుదల నమోదైనా కొత్త తరహా మోసాలు సవాల్ విసురుతున్నాయి. నకిలీ అధికారుల పేరుతో బెదిరింపులు, పెట్టుబడి మోసాలు, వ్యక్తిగత సమాచార తస్కరణపై వేగంగా స్పందించడం, బాధితుల నగదు తరలిపోకుండా నిలువరించడం కీలకంగా మారింది.

**రోడ్డుపైనా సవాలే!**

రాష్ట్రంలో ఏటా దాదాపు 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. ప్రమాద ప్రాంతాల గుర్తింపు, నిబంధనల పటిష్ఠ అమలు, ఇతర శాఖలతో సమన్వయం ద్వారా ప్రమాదాలను తగ్గించడం పోలీసుల ముందున్న మరో ప్రధాన బాధ్యత.

**పోలీసుకూ భరోసా**

సిబ్బంది సంక్షేమంపైనా శాఖ దృష్టి పెట్టింది. ఆరోగ్య భద్రత, బీమా, విద్యా సహాయంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి 'టీజీ-వీర్' వ్యవస్థను తీసుకొచ్చారు. మరోవైపు 7,437 పోలీసు పోస్టుల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**అసలు కొలమానం.. స్టేషన్‌లోనే!**

సాంకేతికత ఎంత పెరిగినా ప్రజలకు పోలీసింగ్ కనిపించేది చివరకు పోలీస్‌స్టేషన్‌లోనే. సామాన్యుడి ఫిర్యాదుకు స్పందన, బాధితుడికి భరోసా, వేగవంతమైన నిష్పక్షపాత దర్యాప్తు, మహిళలు--పిల్లల భద్రతే అసలు కొలమానాలు. సాధించిన పురోగతిని నిలబెట్టుకోవడం.. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడం.. సాంకేతికతను ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఫలితంగా మార్చడం-డీజీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలోని తెలంగాణ పోలీసింగ్ ముందున్న అసలు పరీక్ష ఇదే.

# జీతమెంత..? ఆస్తులెంత!

**కాగితాల్లో రూ.6.13 కోట్లు.. మార్కెట్‌లో విలువెంత?**

**నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు**

**8 చోట్ల సోదాలు.. ఫ్లాట్లు, ప్లాట్లు, పెట్టుబడుల గుర్తింపు**

**జాగ్వార్, ఆడి, నెక్సాన్ కార్లు.. 517.8 గ్రాముల బంగారం**

**రూ.2.63 కోట్ల ఫ్లాట్ పెట్టుబడి-హ్యాండ్ లోన్లపైనా ఆరా**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 22 (మన విశ్వం): నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్ (56)పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ ఎనిమిది చోట్ల సోదాలు నిర్వహించింది. ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలు, సన్నిహితులకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. సోదాల్లో పలు ప్రాంతాల్లో ఫ్లాట్లు, యాదాద్రి, నందిగామ, షామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు గుర్తించినట్లు ఏసీబీ తెలిపింది.

**కాగితాల్లో రూ.6.13 కోట్లు!**

గుర్తించిన చర, స్థిరాస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.6.13 కోట్లుగా ఏసీబీ పేర్కొంది. ప్రస్తుత మార్కెట్ విలువ దీనికంటే అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని తెలిపింది. బ్యాంకుల్లో రూ.41 లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షలు, ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షలు, మ్యూచువల్ ఫండ్లలో రూ.29.55 లక్షల పెట్టుబడులతో పాటు 517.8 గ్రాముల బంగారం గుర్తించినట్లు వెల్లడించింది. జాగ్వార్, ఆడి, నెక్సాన్ కార్లు సహా పలు వాహనాలు ఉన్నట్లు తెలిపింది. డీఆర్టీ వివాదంలో ఉన్న ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్ల పెట్టుబడి, వివిధ వ్యక్తులకు రూ.1.33 కోట్ల హ్యాండ్ లోన్లను గుర్తించినట్లు ఏసీబీ పేర్కొంది. మరిన్ని ఆస్తులు, వాటి నిధుల మూలాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మా వల్లే గెలుపు.. ఇప్పుడు మాపైనే పోరా?

**(మొదటిపేజీ తరువాయి)**

మండిపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో వంశీకృష్ణ గెలుపునకు ప్రేమ్‌సాగర్‌రావు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. వంశీకృష్ణను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అప్పట్లో ఆయన పిలుపునిచ్చారు. నాటి మద్దతు నుంచి నేటి పరోక్ష విమర్శల వరకు వచ్చిన మార్పు స్థానిక కాంగ్రెస్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలను చూపుతోంది. "మీరు దళితుల ప్రేమికులు కాదు.. దళితులను తొక్కేసిందే మీరు" అంటూ ప్రేమ్‌సాగర్‌రావు మరో ఘాటు వ్యాఖ్య చేశారు. "నిజంగానే దళితుల పక్షమైతే దళితులతో ఒక సమావేశం పెట్టండి. వారం రోజుల్లో మీకంటే పది రెట్లు ఎక్కువ మంది దళితులతో నేను సమావేశం పెడతా" అంటూ సవాల్ విసిరారు. దీంతో అంతర్గత వర్గపోరులో దళితుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇటీవల ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంచిర్యాలలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత వంశీకృష్ణ, మంథెన జగన్మోహన్‌రావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల చింపివేత వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంతో స్థానిక కాంగ్రెస్‌లో వర్గాల మధ్య విభేదాలు మరింత బహిరంగమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వంశీకృష్ణ గెలుపు కోసం ప్రేమ్‌సాగర్‌రావు బహిరంగంగా మద్దతిచ్చారు. ఇప్పుడు "మా సహాయం లేకుంటే ఎంపీగా గెలిచేవాడా?" అనే స్థాయికి మాటలు చేరాయి. ఒకప్పుడు ఎన్నికల గెలుపు కోసం ఒక్కటైన నేతల మధ్య రెండేళ్లకే రాజకీయ దూరం పెరగడం మంచిర్యాల కాంగ్రెస్‌లో మారిన సమీకరణాలకు అద్దం పడుతోంది.

**మంచిర్యాలలో ఎవరి పట్టు?**

ఒకవైపు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆయన కుమారుడు ఎంపీ వంశీకృష్ణ.. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు.. మధ్యలో స్థానిక నేతల వర్గ సమీకరణాలు మంచిర్యాల కాంగ్రెస్ రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. బైక్ ర్యాలీ నుంచి ఫ్లెక్సీల వివాదం వరకు.. "మా వల్లే గెలుపు" నుంచి "గంజాయి బ్యాచ్ జాగ్రత్త" వరకు పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నాడు కలిసి గెలిపించిన నేతలు.. నేడు పరోక్ష విమర్శలతో ఎదురెదురుగా నిలుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజా వ్యాఖ్యలతో మంచిర్యాల కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి రాగా.. ఎంపీ వర్గం స్పందన, పార్టీ నాయకత్వం వైఖరి ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
బుధవారం,
సెప్టెంబర్ 23, 2026



# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

**చదువుల బాట పట్టిద్దాం: బోరిగాంలో విద్యార్థుల ర్యాలీ**




**ముధోల్(తానూర్),సెప్టెంబర్ 22(మన విశ్వం):** తానూర్ మండలంలోని బోరిగాం గ్రామంలో మంగళవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఒక ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు,మరియు అంగన్‌వాడీ సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు."బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం, బాలల అందరికీ విద్యను అందిద్దాం" అంటూ విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ సాగించారు. ప్రతి బాల బాలికా ఖచ్చితంగా చదువుకోవాలని,వారిచేత ఎలాంటి పనులు చేయించుకోవద్దని ఈ సందర్భంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు 'సమ్మక్క--సారలమ్మ' పేరు పెట్టాలి

**ధర్మ సమాజ్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్ మహారాజ్ డిమాండ్**




**ములుగు , సెప్టెంబర్ 22 (మన విశ్వం):** వరంగల్ విమానాశ్రయానికి ఆదివాసీ ఆరాధ్య దేవతలు సమ్మక్క--సారలమ్మ పేరు పెట్టాలని ధర్మ సమాజ్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్ మహారాజ్ డిమాండ్ చేశారు. విమానాశ్రయానికి పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన నేపథ్యంలో, తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేసిన 'సమ్మక్క--సారలమ్మ ఎయిర్‌పోర్టు' ప్రతిపాదనకు తాము పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఆదివాసీ--బహుజనుల ఆత్మగౌరవానికి సమ్మక్క--సారలమ్మ ప్రతీకలని కరుణాకర్ అన్నారు. మేడారం జాతరకు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉన్న నేపథ్యంలో వరంగల్ విమానాశ్రయానికి వారి పేరు పెట్టడం సముచితమని అభిప్రాయపడ్డారు.విమానాశ్రయానికి కాకతీయులు, రుద్రమదేవి పేర్లు పరిశీలించాలన్న ప్రతిపాదనలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సమ్మక్క--సారలమ్మ పేరు పెట్టాలన్న బహుజనుల ఆకాంక్షను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కరుణాకర్ మహారాజ్ డిమాండ్ చేశారు.

# తోపుకుంట నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్ల పరిశీలన



**ములుగు, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** వినాయక విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో ములుగు సర్కిల్ నోడల్ ఆఫీసర్, చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్-××) కె. గౌతమ్‌రెడ్డి ములుగులో పర్యటించారు. తోపుకుంట నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించి విద్యుత్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.నిమజ్జనం సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కూరగాయల మార్కెట్ సమీపంలోని వినాయక మండపాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్ఈ (ఓపీ) బి. బిక్షపతి, డీఈ (టెక్నికల్), డీఈ (ఓపీ) ఇన్‌చార్జి కన్నరాజు, ఏడీఈ, ఏఈతో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో మూడున్నర క్వింటాళ్లతో అన్నదానం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌లో మంగళవారం 150వ బ్యాచ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక వ్యాపారుల సహకారంతో గత ఏడేళ్లుగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా మూడున్నర క్వింటాళ్ల ఆహార పదార్థాలతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై వినాయకుడిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# నిగ్వాలో కలెక్టర్ పర్యటన: తాగునీటి కష్టాలపై ఆరా

- ●సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశం
- ●గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**ముధోల్ (కుబీర్), సెప్టెంబరు 22 (మన విశ్వం):** నిర్మల్ జిల్లా కుబీర్ మండలం నిగ్వా గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో ఎదురవుతున్న వివిధ ప్రజా సమస్యలు, ముఖ్యంగా తాగునీటి ఎద్దడిపై ఆయన క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**ప్లాటింగ్ ప్రాంతం పరిశీలన**

పర్యటనలో భాగంగా కలెక్టర్ మొదట గ్రామంలోని ప్లాటింగ్



ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి మౌలిక వసతులు, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన ఆయన, స్థానిక అధికారులను వివరాలు అడిగారు. అనంతరం ఎస్సీ వాడలో పర్యటించి స్థానికులతో నేరుగా మాట్లాడారు. నిత్యం తాగునీటి సరఫరా ఎలా జరుగుతోంది? ఏవైనా అంతరాయాలు కలుగుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

**అధికారులపై అసంతృప్తి.. సత్వర చర్యలకు ఆదేశం**

గ్రామస్తులు తమ నీటి ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, అధికారుల తీరుపై ఆయన స్పందించారు. ప్రజలకు తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, శాశ్వత పరిష్కారానికి అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులను తక్షణమే తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి హోమం

**మంచిర్యాల, సెప్టెంబర్ 22(మన విశ్వం ):** టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ నస్పూర్ లో శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం పల్లవి శ్రీహరి, శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు గుండేటి అరుణ యోగేశ్వర్ల ఆధ్వర్యంలో లోక కళ్యాణర్థం గణపతి హోమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ కాలనీ నస్పూర్ లో శ్రీ సిద్ధి వినాయక శ్రీ సిద్ధి వినాయకుని ఆశీస్సులతో గణపతి హోమం నిర్వహించమన్నారు. శ్రీ సిద్ధి వినాయకుని ఆశీస్సులు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. శ్రీ సిద్ధి వినాయక గణపతి హోమం మంగళవారం సాయంత్రం ప్రభుత్వంతో టీజీజాక్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరీ శ్రీనివాసరావు,జేఏసీ కార్యవర్గ సభ్యులతో జరగే చర్చలు సఫలం అయి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ సమస్యలు అయిన పి ఆర్ సి , పెండింగ్ 6డి ఎ లు,ఓ పి ఎస్ అమలుచేయుట,ఎన్ ఈ



హెచ్ ఎస్ ను సమర్థవంతంగా అమలు చేయుట, పెండింగ్ బిల్లులు అన్ని నెరవేరాలని కోరారు.ఈ గణపతి హోమంలో శ్రీనివాస్ కళ్యాణి దంపతులు సునీల్ శ్రావణి దంపతులు, వెంకన్న శిరీష దంపతులు, పాల్గొని హోమం చేయడం జరిగినది. ఈ గణపతి హోమం కార్యక్రమంలో టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి నాగేశ్వర్, టి ఎన్ జి ఓ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు సైశిడ్ల మొండయ్య , టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ నాయకులు పుప్పాల హనుమంత రావు, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపు రావు, బొడ్డు శ్రావణ్ కుమార్,భూముల రామ్మోహన్, సతీష్ కుమార్, తిరుపతి రెడ్డి, సునీత, టి.తిరుపతి, జె.రాంకుమార్ ,ప్రసాద్, ఉషన్న, టీఎన్జీవో నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

**మంచిర్యాల, సెప్టెంబర్ 22(మన విశ్వం ):** గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు .మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎం కన్వెన్షన్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఉత్సవాల సదస్సు కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన ఉత్సవాల నిర్వహణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో చర్చించారు.ప్రతి ఒక్కరి సహకారంతో గణేష్ నిమజ్జన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఏసీపీ రత్నపురం ప్రకాష్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మంచిర్యాల



తహసీల్దార్ రహఫతుల్లా , మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా ఐ ఎన్ టీ యూ సి పూదరి తిరుపతి, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# భైంసాలో వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం

- వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎస్పీ జానకి షర్మిల
- గడ్డెన్నవాగు వద్ద క్రేన్లతో తొలి గణపతి నిమజ్జనం
- పటిష్ట పోలీస్ బందోబస్తు.. సీసీ కెమెరాల నిఘా



**ముధోల్ (భైంసా),సెప్టెంబరు 22(మన విశ్వం):** భైంసా పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర మంగళవారం భక్తిశ్రద్ధలు, కోలాహలం మధ్య అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పట్టణ పురవీధులు 'గణపతి బప్పా మోరియా' జయజయధ్వానాలతో మారుమోగాయి. భక్తుల కోలాటాలు, తీన్‌మార్ నృత్యాల మధ్య శోభాయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందిఘనంగా శోభాయాత్ర ప్రారంభం పట్టణంలోని గణేష్‌నగర్ మున్నూరు కాపు సంఘం మండలి వద్ద



ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్,నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఏఎస్పీ పి. సాయికిరణ్, సబ్‌కలెక్టర్ సంకేత్‌కుమార్ తదితరులు పాల్గొని వినాయకుడికి ప్రత్యేక హారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి శోభాయాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ వినాయక మండపాల నిర్వాహకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగిన శోభాయాత్ర శివార్లలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకుంది. నిమజ్జన స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ క్రేన్ సహాయంతో తొలి గణేశుడి విగ్రహాన్ని ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఎమ్మెల్యే రామారావు పటేల్ కలిసి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసి ఉత్సవాల ప్రధాన ఘట్టాన్ని ప్రారంభించారు.నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా సాగేందుకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.ఎస్పీ జానకి షర్మిల స్వయంగా క్షేత్రస్థాయిలో ఉంటూ భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సుమారు 700 మంది పోలీసు సిబ్బందితో నిమజ్జన మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.నిమజ్జన ప్రాంతమైన గడ్డెన్నవాగు వద్ద డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టి పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. సున్నితమైన ప్రాంతాల్లో, ప్రధాన నిమజ్జన మార్గాల్లో దాదాపు 100 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా ఉంచారు. ప్రాజెక్టు పరిసరాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.రాత్రి వరకు కొనసాగే ఈ నిమజ్జన వేడుకల కోసం గడ్డెన్నవాగు వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాట్లు చేయగా, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిపుణులైన ఈత గాళ్లను, పడవలను అందుబాటులో ఉంచారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు భక్తులు, కమిటీ సభ్యులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

బుధవారం,
సెప్టెంబర్ 23, 2026
మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# ఎమ్మార్వో ఆఫీస్ మారిస్తే.. ఉద్యమమే!

- మంత్రి ఉత్తమ్ అనుచరుల భూముల కోసమే తరలిస్తున్నారని సపావట్ సుమన్ ఆరోపణ
- భూముల ధరలు పెంచేందుకే కార్యాలయం మార్పు అంటూ విమర్శ
- ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయమేంటని ప్రశ్న
- ప్రస్తుత స్థానంలోనే కొనసాగించాలని డిమాండ్



**మఠంపల్లి, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** మఠంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రస్తుత స్థానం నుంచి మార్చే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సపావట్ సుమన్ డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుచరులు, బినామీలకు చెందినవిగా తాము ఆరోపిస్తున్న భూములతో పాటు కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారి భూముల విలువ పెంచేందుకే కార్యాలయాన్ని వారికి అనుకూలమైన ప్రాంతానికి తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలను ఆయన వెల్లడించలేదు.ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉందని, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఒకేచోట ఉండటంతో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యంగా ఉందని సుమన్ పేర్కొన్నారు. అలాంటి కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించే ముందు ప్రజాభిప్రాయం తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవడం సరికాదని విమర్శించారు.తహసీల్దార్ కార్యాలయం తరలింపుపై ప్రభుత్వం, అధికారులు పునరాలోచించి ప్రస్తుత స్థానంలోనే కొనసాగించాలని సుమన్ డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజాసంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఐఎన్టియుసి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పూదరి తిరుపతి



**మంచిర్యాల, సెప్టెంబర్ 22(మన విశ్వం ):** కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఐఎన్టియుసి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పూదరి తిరుపతి నియామకమయ్యారు.మంగళవారం నియామక పత్రాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా అందుకున్నారు. పుదారి తిరుపతి మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను మంచిర్యాల ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షునిగా నిర్మించిన ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి కి, మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు కి, ఐఎన్టీయూసీ స్టేట్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు .కార్మికుల హక్కుల కోసం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రాబోయే రోజుల్లో మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కార్మిక సంఘం అయిన ఐఎన్టియుసి బలోపేతం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు.

# కల్మెట్ తండాకు.. నీటి భరోసా ఏది?

- తాగు--సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోరుతూ బీఆర్ఎస్ నిరసన
- కోమటికుంట చెరువుకు సాగర్ కాలువ నీరు అందించాలని డిమాండ్
- జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని రఘు వినతి
- కృష్ణానది నుంచి పైప్‌లైన్ వేసి తండాలకు తాగునీరు ఇవ్వాలని డిమాండ్



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 22(మన విశ్వం):** పాలకీడు మండలం కల్మెట్ తండాలో తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి స్థానిక ప్రజలు, రైతులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలోని నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కోమటికుంట చెరువుకు సాగర్ కాలువ నీరు అందేలా చర్యలు తీసుకుంటే కోమటికుంట, జాన్‌పహాడ్, చెరువు తండా, కల్మెట్ తండా ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.జాన్‌పహాడ్ చెరువుకు సాగర్ కాలువ మార్గం ఉన్నప్పటికీ నీరు చేరడం లేదని రఘు ఆరోపించారు. చెరువు నింపితే జాన్‌పహాడ్, చెరువు తండా, కొత్త తండా రైతులకు సాగునీటి సమస్య తగ్గుతుందన్నారు. జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను గూడెం నుంచి ఎల్లాపురం కాలువ వరకు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు.కృష్ణానది సమీపంలో ఉన్నప్పటికీ తండాల ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కృష్ణానది నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి జాన్‌పహాడ్ దర్గా, కల్మెట్ తండా, జాన్‌పహాడ్, కొత్త తండా, చెరువు తండాలకు తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు

# విద్యార్థులకు వ్యాధుల పై అవగాహనా కార్యక్రమం



**మంచిర్యాల, సెప్టెంబర్ 22(మన విశ్వం):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఉపజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ తో జైపూర్ కేజీబీవీ పాఠశాల కళాశాల సందర్శించి ఆర్బిఎస్కే బృందాల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష చేశారు.అదే విధంగా కేజీబీవీ పాఠశాల కళాశాలలో విద్యార్థులకు వ్యాధులు పై తీసుకోవలసిన జాగ్రత్తలు, కీటక జనిత వ్యాధులు, దోమలు కుట్టడం ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు .మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వాటిపైన అవగాహన కలిపించారు. పాఠశాలల్లోని 14 సంవత్సరాలు నిండిన బాలికలకు వ్యాక్సినేషన్ ఇప్పించ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఎస్కే వైద్యులు డాక్టర్ రాము, డాక్టర్ రజిత,సిబ్బంది కళాశాలప్రిన్సిపల్,పని బాల, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్,నామ్దేవ్, ఆశ ఆరోగ్య కార్యకర్తలు లెక్చరర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నక్ష బాట ఆక్రమణపై కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు





**టేకుమట్ల.సెప్టెంబర్ 22 (మన విశ్వం):** మండలంలోని మందలోరిపల్లి,దుబ్యాల గ్రామాల నుంచి నగరం--వావిలాల ఆసుపత్రి మీదుగా కరీంనగర్ జిల్లా సరిహద్దు వరకు గతంలో ఉన్న నక్ష బాటను ఆక్రమించారని,రహదారిని పునరుద్ధరించి ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరారు.గ్రామస్థుల ఆరోపణల ప్రకారం బిలకంటి సంపత్ రావు,కొండల్ రావు కుమారుడు,నక్ష బాటలో భూమిని ఆక్రమించి పామాయిల్ చెట్లను నాటారని తెలిపారు.ఈ విషయంపై ప్రశ్నించిన ప్రజలను బెదిరిస్తూ దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు.సంపత్ రావుతో పాటు ఆయన సోదరులు బిలకంటి లక్ష్మణరావు,బిలకంటి జగపతిరావులు అధికారులను సైతం దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.గతంలో ఈ సమస్యపై భూపాలపల్లి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు అధికారులు స్పందించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి మందలోరిపల్లి పాఠశాల నుంచి నగరం--వావిలాల రహదారి వరకు నక్ష ప్రకారం మార్గాన్ని పునరుద్ధరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మందలోరిపల్లి,దుబ్యాల గ్రామాలకు చెందిన రాజా, ఎం.డి.ఖాదర్,బిక్కినేని కిషన్ రావు,పేరాల మహేందర్ రావు,పేరాల నారాయణ, రమణ,రవి, నరేష్,రాజు తదితరులు పాల్గొన్నారు..

# భక్తాంజనేయ స్వామి ఆలయంలో మహా అన్నదానం

**1,500 మందికి అన్నప్రసాద వితరణ**

**పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



**హన్మకొండ, సెప్టెంబర్ 21(మన విశ్వం):** భక్తాంజనేయ స్వామి దేవాలయంలో 25వ సంవత్సర గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాచమల్ల సునీత--రాజిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సుమారు 1,500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హన్మకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ పాల్గొన్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. నిమజ్జన శోభాయాత్రను భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పోలు లక్ష్మణ్, కోశాధికారి కట్ల రఘు, గౌరవ అధ్యక్షులు తోట కనకరాములు, తోట ప్రకాష్, ఉపాధ్యక్షులు తోట శ్రీనివాస్, దొమ్మటి శ్రీకాంత్, కట్ల రవీందర్‌తో పాటు రేనా దిలీప్, కట్ల రమేష్, రాకేష్, కట్ల రాయమల్లు, నారాయణ, తోట కరుణాకర్, జక్కుల ప్రమోద్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యాదాద్రి కొండపై మహిళ మృతి

- రోడ్డు ప్రమాదంలో ఈశ్వరమ్మ దుర్మరణం
- కారు ఢీకొనడంతో ఘటనాస్థలంలోనే మృతి
- ఆలయ శుద్ధి వరకు దర్శనాలు నిలిపివేత




**యాదాద్రి, సెప్టెంబర్ 22 (మన విశ్వం)** యాదగిరిగుట్ట కొండపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడంతో ఆలయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈశ్వరమ్మ అనే మహిళను ఓ కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గురైన మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కొండపై వేగంగా దూసుకొచ్చిన కారు ఈశ్వరమ్మను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.ఆలయ నియమావళి ప్రకారం కొండపై మరణం సంభవించిన నేపథ్యంలో ఆలయ ద్వారాలను మూసివేశారు. భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఆలయ అధికారులు శాస్త్రోక్త విధానాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం దర్శనాలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కొంతసేపు ఆలయ పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది.

## తిరుపతి హాస్పటల్స్ సేవలు అభినందనీయం -మంత్రి శ్రీధర్ బాబు



**మంచిర్యాల, సెప్టెంబర్22(మన విశ్వం ):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ని లక్ష్మి థియేటర్ చౌరస్తా లో అత్యాధునిక సదుపాయాలు తో ఇటీవలే ప్రారంభమైన తిరుపతి హాస్పటల్స్ ను మంగళవారం తెలంగాణ ఐ టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు.
ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా కేంద్రం రోజురోజుకూ మెడికల్ హబ్‌గా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి హాస్పిటల్ యాజమాన్యం సామాజిక బాధ్యతతో నిరుపేదలకు కూడా నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని ఆయన కోరారు .ఆసుపత్రి వైద్యులు డా. తిరుపతి బండారి (ఎంబీబీఎస్, ఎంఎస్, డీఆర్ఎన్‌బీ--కన్సల్టెంట్ న్యూరో సర్జన్), డా. శ్వేత మల్క బండారి (ఎంబీబీఎస్, ఎంఎస్, ఓబీజీ, ఎఫ్ఆర్ఎం--కన్సల్టెంట్ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణురాలు) కు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఉన్నారు.

# పట్టా కోసం.. రూ.1.30 లక్షల లంచమా!

- తొలి విడత రూ.80 వేలు తీసుకుంటుండగా ఏసీబీ వల
- పెద్దపేట గ్రామ పరిపాలన అధికారి దుర్గాప్రసాద్‌పై అభియోగం
- మధ్యవర్తి రాజేందర్ చేతికి నగదు.. అక్కడే పట్టుకున్న అధికారులు
- భూమి బదలాయింపు, పట్టా పాస్‌బుక్ జారీకి డబ్బుల డిమాండ్
- ఇద్దరి అరెస్ట్.. కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు



**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** భూమి బదలాయింపును ధ్రువీకరించి పట్టాదారు పాస్‌బుక్ జారీ చేసేందుకు రూ.1.30 లక్షలు లంచంగా డిమాండ్ చేశారన్న ఆరోపణపై మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దపేట గ్రామ పరిపాలన అధికారి దుర్గాప్రసాద్ ఏసీబీ వలకు చిక్కారు. తొలి విడతగా రూ.80 వేలు స్వీకరిస్తున్న క్రమంలో దుర్గాప్రసాద్‌తో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన పోతు రాజేందర్ (33)ను ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి పేరుపై భూమి బదలాయింపును ధ్రువీకరించడం, పట్టాదారు పాస్‌బుక్ జారీకి అనుకూలంగా వ్యవహరించేందుకు దుర్గాప్రసాద్ రూ.1.30 లక్షలు డిమాండ్ చేసినట్లు అభియోగం. రూ.80 వేలు ముందుగా, పని పూర్తయ్యాక మిగిలిన రూ.50 వేలు ఇవ్వాలని చెప్పినట్లు పేర్కొంది.

**రూ.80 వేల వద్ద చిక్కారు**

ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం పెద్దపేట శివారులోని వ్యవసాయ పొలాల వద్ద వల పన్నారు. దుర్గాప్రసాద్.. రాజేందర్‌తో కలిసి అక్కడికి వచ్చి రూ.80 వేల నగదును అతడికి ఇవ్వాలని ఫిర్యాదుదారుడికి సూచించినట్లు ఏసీబీ తెలిపింది. నగదు అందజేయగానే అధికారులు రంగంలోకి దిగి రాజేందర్ నుంచి రూ.80 వేలను స్వాధీనం చేసుకున్నారు. అతడి చేతులకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చినట్లు పేర్కొన్నారు.ఇద్దరినీ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కోసం కరీంనగర్‌లోని ఎస్‌పీఈ--ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తులో ఉందని స్పష్టం చేసింది.

**పట్టా సేవల్లో 'పైసల' దందా?**

ప్రజలకు అత్యంత కీలకమైన భూమి బదలాయింపు, పట్టాదారు పాస్‌బుక్ ప్రక్రియలోనే రూ.1.30 లక్షల లంచం డిమాండ్ చేశారన్న ఏసీబీ అభియోగం రెవెన్యూ సేవల్లో అవినీతిపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# డీఈ సత్యనారాయణకు ఘన సన్మానం

**విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వినతి**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి.సత్యనారాయణను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ పొలాలకు విద్యుత్ సౌకర్యాలు, అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఈలు, లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని, శాఖలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో బీసీ విద్యార్థి విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు లింగమయ్య, సమాచార సంరక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి గోపాల్, బీఎస్పీ ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడు మర్లు సాయిబాబు, పట్టణ నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పంటల వ్యాధి నిర్ధారణకు శాస్త్రవేత్తల క్షేత్ర పర్యటన

**రైతులకు పురుగు, తెగుళ్ల నివారణపై శాస్త్రీయ సూచనలు**

**టేకుమట్ల.సెప్టెంబర్ 22 (మన విశ్వం):** మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి,వరి,కంది, పసుపు, మిరప పంటల్లో వ్యాధి నిర్ధారణ క్షేత్ర పర్యటనలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీఆర్‌వీకే),జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది.ఈ సందర్భంగా పంటల పరిస్థితిని పరిశీలించి, రైతులకు పలు సూచనలు అందించారు.శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి పంటల్లోని పురుగులు,తెగుళ్లు,పోషక లోపాలు,ఇతర సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించారు.సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, పురుగుమందులను సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే వినియోగించాలని తెలిపారు.



**పత్తి పంటపై ప్రత్యేక సూచనలు**

పత్తిలో రసంపీల్చే పురుగుల నివారణకు అవసరాన్ని బట్టి సల్ఫాక్సాఫ్లోర్, అఫిడోపైరోపెన్, స్పైరోటెట్రామాట్ ం ఇమిడాక్లోప్రిడ్ వంటి మందులను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు. పురుగుల పర్యవేక్షణ కోసం ఎకరాకు 12 నీలం, తెలుపు స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పింక్ బోల్‌వార్మ్ నివారణకు ఎకరాకు 4--5 లింగకర్షక బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని పర్యవేక్షించాలని సూచించారు.

**ఇతర పంటల్లోనూ నివారణ చర్యలు**

వరి పంటలో మోగి పురుగు, కంది పంటలో ఆకుముడత పురుగు నివారణకు తగిన మందులను సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. పసుపు పంటలో దుంప ఈగ నివారణకు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు.మిరప పంటలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలకు అనుగుణంగా సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సూచించారు.రైతులు పురుగు,తెగుళ్ల ఉధృతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో పురుగుమందులు వినియోగించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. పాల్గొన్న అధికారులుఈ క్షేత్ర పర్యటనలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,జయశంకర్ భూపాలపల్లి కోఆర్డినేటర్ డా.కె.మదన్ మోహన్ రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం,వరంగల్ శాస్త్రవేత్తలు డా.పద్మజ, డా.వీరన్న,డా. క్రాంతికుమార్,మండల వ్యవసాయ అధికారి శ్రీమతి కళ్యాణి,రైతులు పాల్గొన్నారు.

# పొదుపుతోనే విద్యుత్ వ్యవస్థకు స్థిరత్వం: నిర్మల్ సర్కిల్ ఎస్ఈ రమేష్



**ముధోల్(నిర్మల్), సెప్టెంబర్ 22(మన విశ్వం):** విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవడం వల్ల కేవలం కరెంట్ బిల్లులు తగ్గడమే కాకుండా, విద్యుత్ వ్యవస్థ స్థిరత్వానికి, సహజ వనరుల పరిరక్షణకు మరియు పర్యావరణ రక్షణకు ఎంతో దోహదపడుతుందని నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) రమేశ్ అన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు. లక్షలాది కుటుంబాలు ఈ పొదుపు విధానాన్ని పాటిస్తే సమాజానికి విస్తృత ప్రయోజనాలు చేకూరుతాయని ఎస్ఈ రమేశ్ స్పష్టం చేశారు.

# బడికి వెళ్లాలంటే.. ఈ గుంతలు దాటాల్సిందేనా?

- లోడ్‌పల్లి రోడ్డుపై విద్యార్థుల బైఠాయింపు
- గుంతలమయమైన రహదారితో పాఠశాల ప్రయాణానికి నిత్యం అవస్థలు
- వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్
- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు
- విద్యార్థులే రోడ్డెక్కే వరకు పట్టించుకోరా? అంటూ ప్రశ్న



**కొమరం భీం, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** చేతిలో పుస్తకాల బ్యాగులు.. బడికి వెళ్లాలన్న తపన.. కానీ దారి మాత్రం గుంతలమయం. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం లోడ్‌పల్లి వద్ద రహదారి దుస్థితిపై విద్యార్థులు రోడ్డెక్కారు. పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.వర్షాలతో రహదారి మరింత దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారిందని విద్యార్థులు వాపోయారు. ప్రతిరోజూ ఇదే మార్గంలో పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని, గుంతల కారణంగా ప్రయాణం కష్టంగా మారిందని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.చదువుకు 'దారి' ఏది?గ్రామీణ విద్యార్థులకు పాఠశాల ఉండటం ఎంత ముఖ్యమో.. అక్కడికి సురక్షితంగా చేరుకునే రహదారి ఉండటం కూడా అంతే అవసరం. రోడ్డు దుస్థితి విద్యార్థులతో పాటు గ్రామస్తులు, రైతులు, అత్యవసర వైద్య సేవలకు వెళ్లేవారిపైనా ప్రభావం చూపుతుంది. చిన్నారులే పుస్తకాల బ్యాగులతో రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపే పరిస్థితి రావడం స్థానిక మౌలిక వసతుల సమస్యను వెలుగులోకి తెచ్చింది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చడంతో సరిపెట్టకుండా రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు. రోడ్డు మరమ్మతులకు నిధులు ఉన్నాయా? పనులు ఎప్పుడు చేపడతారు? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం:హాజరైన సర్పంచ్ లలిత భోజన్న



**ముధోల్ (లోకేశ్వరం), సెప్టెంబర్ 22(మన విశ్వం):** లోకేశ్వరం మండలంలోని హావర్గ, మన్మథ్ గ్రామాలలో వినాయక చవితి వేడుకలు ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న విఘ్నేశ్వరుడి విగ్రహాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లతో కనులపండువగా సాగింది. నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్మథ్ గ్రామ సర్పంచ్ లలిత భోజన్న, విడిసి (ఎణజ) సభ్యులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లోకేశ్వరం ఎస్ఐ ప్రదీప్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో, వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి

# మంచ్య తండాలో అన్నదానం

**మఠంపల్లి, సెప్టెంబర్ 22 (మన విశ్వం):** ం మఠంపల్లి మండలం మంచ్య తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ మాలోతు భద్రమ్మ--బాబు నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.



# జూరాల నీటిని పంటలకు విడుదల చేయాలి

- తాగునీటి అవసరం ఏర్పడితే కర్ణాటక నుంచి నీరు తెచ్చుకోవాలి
- రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని సీపీఐ ఆరోపణ




**వనపర్తి, సెప్టెంబర్ 22**
జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని వెంటనే పంటల సాగుకు విడుదల చేయాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. తాగునీటి అవసరం ఏర్పడినప్పుడు కర్ణాటకలోని ప్రాజెక్టుల నుంచి నీటిని తీసుకురావచ్చని సూచించారు.మంగళవారం వనపర్తిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతోనే రైతులు నమ్మకంతో పంటలు సాగు చేశారని తెలిపారు. పంటల కోసం కోట్ల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని పేర్కొన్నారు. అయితే తొమ్మిది రోజులుగా జూరాల కాలువలకు నీటి విడుదల నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్తులో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం నీటిని విడుదల చేయడం లేదని ప్రభుత్వం చెబుతోందని రమేష్ విమర్శించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు జూరాల వద్ద ఆందోళనలకు దిగగా, వివిధ రాజకీయ పార్టీలు వారికి మద్దతుగా నిలిచాయని తెలిపారు. ఆందోళనలకు మద్దతు తెలిపిన రాజకీయ నాయకులను గృహ నిర్బంధం చేయడం, ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని అన్నారు.రైతుల ఆందోళనలు తీవ్రం కావడంతో కర్ణాటక ప్రాజెక్టుల నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు నీటిని విడుదల చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం ముందుచూపు లేని నిర్ణయమని రమేష్ విమర్శించారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో సుమారు 9 టీఎంసీల నీరు ఉందని, అందులో 1.8 టీఎంసీలను తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచి, మిగిలిన నీటిని పంటలకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.తాగునీటికి కొరత ఏర్పడే పరిస్థితి వస్తే అప్పట్లో కర్ణాటక ప్రభుత్వాన్ని సంప్రదించి నీటిని తెచ్చుకోవచ్చని అన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు బుధవారం నుంచే జూరాల కాలువలకు నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని రమేష్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మతో పాటు చిన్న కురుమన్న, శేఖర్, లక్ష్మీనారాయణ, జయమ్మ, వెంకటమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

# నేడే అభివృద్ధి పండుగ

**లింబా (కే)గ్రామంలో డ్వాక్రా, ఆరోగ్య ఉపకేంద్ర భవనాల ప్రారంభోత్సవం**
**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**
**భారీ ఏర్పాట్లు చేసిన పాలకవర్గం**



**ముధోల్(కుంటాల), సెప్టెంబర్ 22(మన విశ్వం):** మండల పరిధిలోని లింబా (కే) గ్రామంలో బుధవారం అభివృద్ధి పండుగ వాతావరణం నెలకొననుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్వాక్రా మహిళా సంఘ భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. నేడు ఈ భవనాలను అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం వెల్లడించింది.ఈ ప్రారంభోత్సవ వేడుకకు ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా విచ్చేసి భవనాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.గ్రామస్తుల సౌకర్యార్థం అందుబాటులోకి వస్తున్న ఈ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ యువత మరియు లింబా (కే) గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని గ్రామ సర్పంచ్ సుంకరోళ్ల గీత-మహేంధర్, ఉపసర్పంచ్ ఆమెడ సత్యనారాయణ మరియు సమస్త పాలకవర్గం పిలుపునిచ్చారు.

# పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**








**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22**
పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో జిల్లా లో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ, డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 25 వ తేదీన వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం గొల్లల గుడి వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. 26వ తేదీన ఉదయం 8 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఇంచార్జీ జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్ డీఈవో సిద్ధార్థ అధికారులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌పై అనుచిత పోస్టులు: లశెట్టి నర్సయ్యపై పోలీసులకు ఫిర్యాదు

**- పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్ యువజన సంఘం నేతల ఆగ్రహం**



**ముధోల్(నిర్మల్), సెప్టెంబర్ 22( మన విశ్వం):**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, పోస్టులు చేసిన లశెట్టి నర్సయ్యపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మంగళవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ మాట్లాడుతూ.. మహనీయుడు,భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గౌరవానికి భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు.ఇలాంటి విద్రోహపూరితమైన, గౌరవహీనమైన చర్యలను సమాజంలో ఎవరూ సహించబోరని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్‌ను కించపరుస్తూ సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన సదరు వ్యక్తిపై పోలీసులు చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# లక్ష్మీదేవి పేటలో ఎయిడ్స్ పై కళారంజని కళాబృందంపై అవగాహన సదస్సు

**(లక్ష్మీదేవి పేట) ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22**
తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కలెక్టర్ డిఎం అండ్ హెచ్ ఓ, దిశ సహాయ సహకారము తోటి కళా రంజని సందీప్ కళాబృందం ద్వారా లక్ష్మిదేవిపేట గ్రామంలో వారాంతపు సంతలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిపై కళా ప్రదర్శనలు నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి వ్యాధి నాలుగు కారణాల ద్వారా వస్తుంది
1, రక్షణ లేని సెక్స్
2, కలుశుతామైన రక్తమార్పిడి
3, కలుషితమైన సూదులు చిరంజీవిలు
4, తల్లికి హెచ్ఐవి వ్యాధి ఉంటే గర్భంధాలిస్తే పుట్టపోయే బిడ్డకు వస్తుంది హెచ్ఐవి అంటువ్యాధి కాదు ఈ నాలుగు కారణాల వల్ల మాత్రమే వస్తుంది సుఖ వ్యాధులు ఉన్నోళ్లకు హెచ్ఐవి వ్యాధి వచ్చే అవకాశం పది రెట్లు ఎక్కువ సుఖ వ్యాధులు ఉన్నోళ్లు డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి హెచ్ఐవి వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి యువకులు దీని పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి తల్లికి హెచ్ఐవి వ్యాధి ఉంటే



ఆమె గర్భం దాలుస్తే పుట్టబోయే బిడ్డను కాపాడడానికి మందులు ఉన్నాయి కావున పుట్టబోయే బిడ్డను కాపాడవచ్చు కనుక గర్భం దాల్చిన ప్రతి తల్లి హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలి
హెచ్ఐవి వ్యాధిగ్రస్తులను హింసించకుండా ప్రేమ ఆప్యాయతలు చూపిస్తే వారు ఎక్కువ కాలం జీవించడానికి అవకాశముంది కళాకారులు,పాటల ద్వారా, పల్లె సుద్దుల ద్వారా నాటకాల ద్వారా తెలియజేశారు, ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ 1097 క్యూర్ కోడ్ గూర్చి అవగాహనా కల్పించారు ఈ కార్యక్రమంలో దిశ డిపిఎం, జ్యోతి వై ఆర్ జీ కేర్ డిఆర్పి ముస్తక్ సూపర్వైజర్ సరిత లింక్ వర్కర్ స్వప్న సుమలత సిబ్బంది పాల్గొన్నారు కార్యక్రమంలో పాంప్లెన్స్, పోస్టర్స్ రక్త పరీక్షలు నిర్వహించారు కళాకారులు. పోలేపాక సందీప్, ,కృష్ణం రాజు , కరుణాకర్ లక్ష్మణ్ రజిని, పాల్గొన్నారు

# భైంసా వేలంలో భక్తి తన్మయత్వం:రూ.20 వేలకు వినాయకుడి లడ్డూను దక్కించుకున్న ఎస్పీ జానకి షర్మిల



**ముధోల్ (భైంసా), సెప్టెంబరు 22(మన విశ్వం):** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా భైంసాలోని గణేష్ నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుని లడ్డూ ప్రసాదానికి మంగళవారం సాయంత్రం భారీ ప్రజాసందోహం మధ్య బహిరంగ వేలం నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన ఈ వేలం పాటలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల పాల్గొని, అత్యధికంగా రూ. 20 వేలు పలికి స్వామివారి దివ్య లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.మహిమగల ఈ లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమని, స్వామివారి కృపతో జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. వేలం అనంతరం మున్నూరు కాపు సంఘం కమిటీ సభ్యులు ఎస్పీ జానకి షర్మిలను శాలువాతో ఘనంగా సత్కరించి, లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్, మున్సిపాల్ చైర్మన్ దత్తు, విలాస్ గాదేవర్ తదితరులు పాల్గొన్నారు.

# సంజీవయ్య కాలనీలో గణనాథుడిని దర్శించుకున్న బండి రమేష్

**-- ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించాను: బండి రమేష్**

**బాలానగర్ సెప్టెంబర్ 23**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి 5వ దశతో పాటు బాలానగర్ డివిజన్ పరిధిలోని సంజీవయ్య కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడికి పూజలు చేసి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బండి రమేష్ పాల్గొని భక్తులతో కలిసి



అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.బండి రమేష్ మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వర్ణం సొంతమాయె



## ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం

### ఆసియా క్రీడల మహిళల క్రికెట్

నాగోయ (జపాన్) : ఆసియా క్రీడల్లో భారత మహిళలు తొలి స్వర్ణం సాధించారు. టీ20 ఫార్మాట్‌లో జరిగిన టోర్నమెంట్‌లో తిరుగులేన విజేతగా నిలిచారు. మంగళవారం జరిగిన ఫైనల్లో శ్రీలంకపై భారత్ 147 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. భారత్ తొలుత 20 ఓవర్లలో 3 వికెట్లకు 216 పరుగులు చేయగా, ఛేదనలో శ్రీలంక 15.4 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసియా క్రీడల్లో పసిడి పతకం టీమ్ ఇండియా అమ్మాయిల సొంతమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు టాప్ ఆర్డర్ భారీ స్కోరు అందించింది. ఓపెనర్లు స్మృతీ మంధాన (79, 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు), షెఫాలీ వర్మ (48, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), రిచా ఘోష్ (49 నాటౌట్, 22 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. మంధాన ఏడు సిక్సర్లు, ఐదు ఫోర్లతో అర్ధ సెంచరీ బాదింది. షెఫాలీ వర్మ తనదైన శైలిలో మూడేసి సిక్స్‌లు, ఫోర్లతో దండెత్తింది. రిచా ఘోష్ డెత్ ఓవర్లలో అదిరే ముగింపు అందించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19, 17 బంతుల్లో 3 ఫోర్లు) నిరాశపరిచింది. భారీ ఛేదనలో శ్రీలంక అమ్మాయిలు చతికిల పడ్డారు. భారత బౌలర్లు దీప్తి శర్మ (3/6), షెఫాలీ వర్మ (2/3), శ్రేయాంక పాటిల్ (2/9), శ్రీ చరణి (2/13) వికెట్ల వేటలో విజృంభించారు. దీంతో 15.4 ఓవర్లలోనే శ్రీలంక మహిళలు 69 పరుగులకు ఆలౌటయ్యారు. కెప్టెన్ చమరి ఆటపట్టు (29, 21 బంతుల్లో 5 ఫోర్లు) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ చెప్పుకోదగిన ప్రదర్శన కనబరచలేదు. 147 పరుగులతో భారీ విజయం సాధించిన భారత్ స్వర్ణం సొంతం చేసుకోగా.. శ్రీలంక రజత పతకంతో సరిపెట్టుకుంది.

**బ్యాడ్మింటన్‌లో పతకం ఖాయం** బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసింది. మంగళవారం జరిగిన మెన్స్ టీమ్ ఈవెంట్ క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య జపాన్‌పై 3–0తో భారత్ ఘన విజయం సాధించింది. జపాన్‌పై విజయంతో ఆసియా క్రీడల్లో 40 ఏండ్ల తర్వాత మెన్స్ జట్టు బ్యాడ్మింటన్‌లో పతకం అందుకోనుంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 11–21, 21–5, 21–19తో కొడాయ్ నరొకపై గెలుపొంది అదిరే ఆరంభం అందించాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21–18, 24–22తో హోకి, యుగోలపై గెలుపొందారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 21–10, 21–19తో కొకిపై ఖతర్నాక్ విజయం సాధించాడు. నేడు సెమీఫైనల్లో అగ్ర జట్టు చైనాతో భారత్ తలపడనుంది.

# గట్టెక్కిన అయ్యర్‌సేన!



## ● జపాన్‌పై 2 పరుగులతో గెలుపు

**శానో (జపాన్) :** పసికూన జపాన్‌పై అగ్రజట్టు భారత్ కష్టంగా గట్టెక్కింది. ఐదు ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో భారత్ తొలుత 32/4 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16, 12 బంతుల్లో 1 ఫోర్), సంజు శాంసన్ (9, 7 బంతుల్లో 1 ఫోర్) రాణించారు. అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (3), తిలక్ వర్మ (1 నాటౌట్), శివం దూబె (0 నాటౌట్) నిరాశపరిచారు. 30 బంతుల భారత ఇన్నింగ్స్‌లో కేవలం రెండు బౌండరీలు మాత్రమే రాగా.. ఒక్క సిక్సర్ కూడా కొట్టలేదు. ఊరించే ఛేదనలో జపాన్ అద్భుతానికి చేరువైంది. 5 ఓవర్లలో 3 వికెట్లకు 30 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (2/13) రెండు వికెట్లు పడగొట్టినా.. జపాన్ బ్యాటర్లు లక్ష్యం దిశగా సాగారు. ఓపెనర్ ఫ్లెమింగ్ (12, 12 బంతుల్లో 1 ఫోర్), బెంజమిన్ (9 నాటౌట్, 8 బంతుల్లో), ఇబ్రహీం (4, 3 బంతుల్లో ఓ ఫోర్) పరుగుల వేట సాగించారు. ఆఖరు ఓవర్లలో జపాన్‌కు 9 పరుగులు అవసరం కాగా.. భారత్ ఐదు పరుగులే ఇచ్చి ఊపిరి పీల్చుకుంది. ఆసియా క్రీడల ముంగిట ఆతిథ్య జపాన్, భారత్ ఏకైక టీ20 మ్యాచ్‌లో గెలుపొందిన అయ్యర్‌సేన సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత్ నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోగా.. ప్రత్యర్థి ఇంకా ఖరారు కాలేదు.



## చాంపియన్ నజాముద్దీన్

హైదరాబాద్ : తెలంగాణ షో జంపింగ్ పోటీల్లో 11 ఏండ్ల యువ రైడర్ మిర్ నజాముద్దీన్ చాంపియన్‌గా నిలిచాడు. కండ్లుచెదిరే నైపుణ్యాలను నిలకడగా ప్రదర్శించిన నజాముద్దీన్.. 105-110సెమీ షో జంపింగ్ (అండర్-14)లో రికొట్ట హార్స్‌తో అదరగొట్టాడు. ఇదే విభాగంలో సూర్యరామ్ వర్మ, ఐజా మిర్‌లు టాప్-3లో నిలిచారు. 60సెమీ షో జంపింగ్ అండర్-14, ఓపెన్ విభాగంలో సైతం మిర్ నజాముద్దీన్ ఆజామ్ విజేతగా నిలిచాడు.

## ముగిసిన తెలంగాణ షో జంపింగ్

హైదరాబాద్ : 10 రోజులు, 120 పతక ఈవెంట్లు, 450 రైడర్లు పోటీపడిన ఈఎఫ్ఐ జాతీయ క్వాలిఫయర్, తెలంగాణ షో జంపిన్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. వయో విభాగాలు సహా ఓపెన్ కేటగిరీల్లో షో జంపింగ్‌లో పతక ప్రదర్శన కనబరిచిన రైడర్లను నాసర్ పోలో, ఈక్వెస్ట్రియన్ అకాడమీ ప్రతినిధులు అభినందించారు. విజేతలకు ఎన్ఏఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ నవాబ్ మీర్ కుతుబుద్దీన్ ఖాన్ బహుమతులు ప్రదానం చేశారు.





## రిటైర్మెంట్ ప్రకటించిన ఫాస్ట్ బౌలర్

హైదరాబాద్ : ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ (36) అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. వరుస గాయాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే, ఫ్రాంచైజీ లీగుల్లో మాత్రం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఇంగ్లండ్ తరఫున అన్ని ఫార్మాట్లలో కలిపి 146 మ్యాచ్‌లలో 253 వికెట్లు తీసిన మార్క్ వుడ్, 38 టెస్టుల్లో 119 వికెట్లు సాధించారు. 2015 యాషెస్, 2019 వన్డే వరల్డ్ కప్, 2022 టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్లలో ఆయన సభ్యుడిగా ఉన్నారు



## ఓసీఏ అబ్జర్వర్‌గా రవికాంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆట ప్రతినిధి:** జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అబ్జర్వర్‌గా తెలంగాణ స్పోర్ట్స్ కమిటీ సభ్యుడు, అర్జున అవార్డు గ్రహీత వి. రవికాంత్ రెడ్డి నియమితులయ్యారు. భారత క్రీడారంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఓసీఏ ఈ కీలక బాధ్యతలు అప్పగించింది.

## క్రికెట్‌కు వుడ్ వీడ్కోలు

లండన్: ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్ గెలిచిన రెండు ప్రపంచకప్ (2019 వన్డే, 2022 టీ20) లలో సభ్యుడిగా ఉన్న అతడు.. 11 ఏండ్ల కెరీర్‌లో 38 టెస్టులు, 70 వన్డేలు, 38 టీ20ల్లో ఇంగ్లిష్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 2015లో అరంగేట్రం చేసిన ఈ బౌలర్.. టెస్టుల్లో 119, వన్డేల్లో 80, టీ20ల్లో 54 వికెట్లు పడగొట్టాడు.






## అక్టోబర్ 1న ఐఎల్‌టీ20 వేలం..

ఇంటర్నేషనల్ టీ20 లీగ్ వేలానికి సమయం దగ్గరపడింది. అక్టోబర్ 1వ తేదీన దుబాయ్‌లో ఆక్షన్ జరుగనుంది. ఐసీసీ అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో నిర్వహించనున్న వేలంలో 20 దేశాలకు చెందిన ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే.. ఈసారి ఎనిమిది వందలకు పైగా క్రికెటర్లు రిజిష్టరవ్వగా.. వడబోత అనంతరం రెండొందల మంది మాత్రమే వేలంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు.దుబాయ్ వేదికగా ఐఎల్‌టీ20 వేలం జరుగుంది. అక్టోబర్ 1వ తేదీన అక్కడి ఐసీసీ అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో ఆక్షన్ ఉండనుంది. వేలానికి మరో తొమ్మిది రోజులే ఉండడంతో.. ప్రతి ఫ్రాంచైజీ వద్ద ఎంత డబ్బుంది? ఎంత మంది క్రికెటర్లు వేలంలో ఉన్నారు? ఎన్ని స్లాట్లు ఖాళీగా ఉన్నాయి? అనేవి కీలకంగా మారాయి. ఈసారి ప్రతి ఫ్రాంచైజీ 13 లక్షల అమెరికన్ డాలర్లు(భారతీయ కరెన్సీలో రూ.12.42 కోట్లు) ఖర్చు చేయనుంది. అయితే.. రిటెన్షన్‌కు దాదాపు రూర.6 కోట్లు పోగా.. మిగతా ఆరు కోట్లలో అవసరమై ఆటగాళ్లను కొనేందుకు సిద్ధమవుతున్నాయి ఫ్రాంచైజీలు.

# సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి..

## 'శివశంకర వర ప్రసాద్' నుంచి 'చిరంజీవి' వరకు అపూర్వ ప్రయాణంపై మెగాస్టార్ భావోద్వేగం






తన జీవితంలో అతిపెద్ద విజయమని వ్యాఖ్య తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్ గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు. కాగా, చిరు నటించిన మొదటి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ, 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదలైంది. ప్రస్తుతం ఆయన 'కాకా', 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు.

# బ్లడ్ బ్యాంక్‌ను నిస్వార్థంగా నడిపిస్తున్నా

### రక్తాన్ని అమ్ముకుంటున్నాడు అనే ఆరోపణలపై చిరంజీవి ఘాటు స్పందన



తన సినీ ప్రస్థానంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్'లో మెగాస్టార్ చిరంజీవి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా, తనపై, చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారాలు, నిందలపై ఆయన అత్యంత తీవ్రస్థాయిలో స్పందించారు. దశాబ్దాలుగా ఎంతో పవిత్రంగా, నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌లో రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ కొంతమంది చేస్తున్న దారుణమైన ఆరోపణలు పూర్తిగా మూర్ఖత్వంతో కూడుకున్నవని ఆయన కొట్టిపారేశారు.

సినిమాల్లో తాను తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన మొత్తాన్ని రక్తం విక్రయించడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లను విక్రయించాల్సి ఉంటుందో విమర్శలు చేసేవారికి కనీస ఆలోచన ఉందా? అని చిరంజీవి ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి వద్ద నుంచి ఎలాంటి డొనేషన్లు స్వీకరించకుండా, కేవలం తన సొంత కష్టార్జితంతోనే ఈ సేవా సంస్థను స్థాపించి నడుపుతున్నానని స్పష్టం చేశారు. రక్తదానం అనే పవిత్ర ప్రక్రియ ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న వేళ, ఇటువంటి పనికిమాలిన వ్యాఖ్యలను తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వనని, ధర్మమే తనను కాపాడుతుందని వ్యాఖ్యానించారు.

# మహావీర్ కర్ణగా రాఘవ లారెన్స్..

### అంచనాలు పెంచుతున్న ఫస్ట్ లుక్!




ప్రముఖ నటుడు రాఘవ లారెన్స్, దర్శకుడు రమేశ్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'మహావీర్ కర్ణ' నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో కర్ణుడి పాత్రలో రాఘవ లారెన్స్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ మూవీస్ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ పోస్టర్‌ను విడుదల చేయడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. పెన్ మూవీస్ అధినేత జయంతిలాల్ గడ, ఆర్‌వి స్టూడియోస్ మరియు శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మొదటిసారిగా ఒక పౌరాణిక పాత్రను పోషిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను ప్రేక్షకులకు ఒక గొప్ప విజువల్ ఫీస్ట్‌గా అందించాలనే లక్ష్యంతో మేకర్స్ పని చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం భారీ సెట్లు, ఆనాటి కాలాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లు, కళ్లు చెదిరే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అత్యాధునిక విఎఫ్ఎక్స్ హంగులతో కర్ణుడి ప్రపంచాన్ని అపూర్వమైన రీతిలో తెరపై ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గంభీరమైన రాజ్యాలు, పురాతన యుద్ధ క్షేత్రాలు, ఉత్కంఠభరితమైన పోరాట సన్నివేశాలతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలని దర్శకుడు రమేశ్ వర్మ భావిస్తున్నారు. గౌరవం, విధి, విశ్వాసం, త్యాగాలకు ప్రతీకగా నిలిచే కర్ణుడి పాత్రలో లారెన్స్ ఎలా ఉంటారన్నది ఆసక్తికరం. సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ఒక్కొక్కటిగా వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# రష్మిక అంకితభావం అద్భుతం..

### : 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లే




రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తాను దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా' గురించి, ఆమెతో తనకున్న అనుబంధం గురించి దర్శకుడు రవీంద్ర పుల్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రష్మికతో కలిసి పనిచేయడం ఒక స్ఫూర్తిదాయకమైన, మర్చిపోలేని అనుభూతి అని ఆయన అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ పోస్ట్ చేశారు. "కొన్ని పుట్టినరోజులు కేవలం శుభాకాంక్షల వల్ల ప్రత్యేకంగా నిలుస్తాయి. కానీ ఈ పుట్టినరోజు మాత్రం ఆ విషెస్ చెప్పిన వారి వల్ల మరింత ప్రత్యేకంగా మారింది. నాకు కాల్స్, మెసేజ్‌లు, పోస్టుల ద్వారా విషెస్ చెప్పిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది" అంటూ రవీంద్ర తన పోస్టులో పేర్కొన్నారు. అనంతరం 'మైసా' చిత్రం గురించి ప్రస్తావిస్తూ.. "మా ప్రయాణంపై నమ్మకం ఉంచి, 'మైసా' చిత్రాన్ని ఇంతగా ఆదరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది. ఈ కల నిజం కావడానికి అండగా నిలిచిన నా టీమ్, కుటుంబం, స్నేహితులు, ముఖ్యంగా రష్మిక మందన్న గారికి నేను ఎంతో రుణపడి ఉంటాను" అని ఆయన వివరించారు. రష్మిక గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "ఈ సినిమాను నమ్మి, ఎంతో విశ్వాసంతో నిలబడిన రష్మిక గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. 'మైసా' కోసం ఆమె ఎంతో నిజాయితీ, అంకితభావం, హృదయంతో పనిచేశారు. ఆమెతో కలిసి పనిచేయడం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఈ ప్రయాణంలో ఆమె ఒక ముఖ్యమైన భాగం కావడం సంతోషంగా ఉంది" అని రవీంద్ర పుల్లే తెలిపారు. "మీ అందరి ప్రేమ నన్ను మరింత బాధ్యతాయుతంగా ఉండేలా చేస్తుంది. మెరుగైన పని చేయడానికి నన్ను ప్రోత్సహిస్తుంది. మరిన్ని మంచి కథలతో మీ ముందుకు వస్తాను. ఈ ప్రయాణంలో అందరం కలిసి ముందుకు సాగుదాం" అని చెబుతూ ఆయన తన పోస్టును ముగించారు. ప్రస్తుతం రవీంద్ర పుల్లే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# స్టైలిష్ అవతార్‌లో రాశి ఖన్నా..

### మోనోక్రోమ్ ట్రెండ్ సెట్!



టాలీవుడ్ లోనే కాక బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో పవర్-డ్రెస్సింగ్ గోల్స్‌ను సెట్ చేస్తూ అలరిస్తున్న బ్యూటీ రాశి ఖన్నా, తాజాగా తన స్టైలిష్ ఫోటోలతో సోషల్ మీడియాను ఊపేస్తోంది. షార్ప్‌గా ఉన్న క్లాసీ వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌లో ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ అండ్ రాయల్ పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. మోడర్న్ టచ్‌తో ఉన్న ఈ మోనోక్రోమ్ అవతార్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్ మనసులను కొల్లగొడుతున్నాయి..ఆ విశేషాలు చూద్దాం.. తాజా స్పెషల్ ఫోటోషూట్ కోసం రాశి ఖన్నా ప్రసిద్ధ స్టైలిస్ట్ షీఫా జే గిలానీ డిజైన్ చేసిన వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌ను ఎంచుకుంది. ఇక ప్లంగింగ్ నెక్‌లైన్, స్ట్రక్చర్డ్ షోల్డర్స్‌తో ఉన్న ఈ వైట్ అవుట్‌ఫిట్‌లో రాశి ఎంతో ఎలిగంట్‌గా కనిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా సాఫ్ట్ రెట్రో వేవ్ బ్యాంగ్స్, వార్మ్ బ్లష్ టోన్స్, నూడ్ లిప్‌స్టిక్ జత చేసి ఆమె ఇచ్చిన రాయల్ లుక్ ఈ ఫోటోషూట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది సోషల్ మీడియాలో ఈ గ్లామరస్ పిక్స్ షేర్ చేస్తూ రాశి ఖన్నా "మీరు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తూ ఉన్న సమయంలో.." అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు "స్టన్నింగ్", "బ్యూటిఫుల్ ఐకాన్", "ఫ్యాషన్ క్వీన్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. వరుస విజయాలతో సక్సెస్ ట్రాక్: ఇక 'యోధ', 'అరన్మనై 4', 'ది సబర్మతి రిపోర్ట్' వంటి సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి విజయాలు అందుకుంది రాశి. నటిగా తనలోని వైవిధ్యాన్ని చూపుతూనే, మరోవైపు హెవీ ఫ్యాషన్ ఎడిటోరియల్ షూట్స్‌తో సౌత్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ టాప్ స్టైల్ ఐకాన్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

# రణబాలి నుంచి మెలోడీ సర్ప్రైజ్..



టాలీవుడ్ మోస్ట్ హిట్ పేయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి "ఏందయ్యా స్వామి" అనే బ్యూటిఫుల్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 1850ల కాలం నాటి పల్లెటూరి వాతావరణం, నూతన దంపతుల ముద్దుల అనుబంధాన్ని చాటే ఈ పాట వినగానే శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తోంది. ాశ్రీంశీ =ఘుం – నాని సినిమాల్లో ఇప్పటివరకు ఇలాంటి విలనే లేడా? రాయల్ మ్యాజిక్‌లా విజయ్–రష్మిక కెమిస్ట్రీ: 'రణబాలి' సినిమాలో విజయ్ దేవరకొండ రణబాలిగా, రష్మిక మందన్న జయమ్మగా నటిస్తున్నారు. ఈ "ఏందయ్యా స్వామి" పాట వీరిద్దరి పెళ్లి వేడుక నేపథ్యంతో పాటు నూతన దంపతుల మధ్య ఉండే అమాయకమైన ప్రేమను, సాన్నిహిత్యాన్ని ఎంతో అందంగా చూపుతోంది. ఇక 19వ శతాబ్దపు తెలుగు సాంప్రదాయ పెళ్లి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన తీరు, వారిద్దరి మధ్య ఉన్న హిట్ కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అజయ్–అతుల్ దివ్యమైన సంగీతం: ఈ పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్–అతుల్ అందించిన స్వరాలు ప్రధాన బలం. పల్లెటూరి జానపద శైలి, ఆధునిక మెలోడీ ట్యూన్స్ కలబోతగా రూపొందిన ఈ పాట వినగానే రిపీట్ మోడ్‌లో పెట్టుకునేలా ఉంది. శ్వేతా మోహన్, అజయ్ గోగావాలే తమ తియ్యని గొంతుతో ఈ మెలోడీకి ప్రాణం పోయగా, సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం నూతన దంపతుల అనురాగాన్ని ఎంతో చక్కగా ఆవిష్కరించింది. ఈ పాట పూర్తి స్థాయిలో విడుదలకాక ముందే, దీనికి సంబంధించిన చిన్న వెడ్డింగ్ ప్రోమో సోషల్ మీడియాను ఊపేసింది. ఇప్పుడు ఫుల్ లిరికల్ సాంగ్ రావడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. విజువల్ గ్రాండియర్, ఎమోషనల్ స్టోరీ టెల్లింగ్, అద్భుతమైన మ్యూజిక్ కలగలిసి ఈ పాటను ఒక టైమ్‌లెస్ లవ్ యాంథమ్‌గా మార్చేశాయి. అక్టోబర్ 16న థియేటర్లలోకి రణబాలి: ఇప్పటికే "ఏందయ్యా స్వామి" పాటతో శ్రోతల మనసు దోచుకున్న 'రణబాలి' చిత్రంపై అంచనాలు తారస్థాయికి చేరాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్–ఇండియా చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఇక విజయ్–రష్మిక మ్యాజిక్ మళ్లీ రిపీట్ కావడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569